DYNAMIC EDITION
# వాయిస్ టుడే
www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మననేత్రం
Follow
పేజీలు 2
సోమవారం, నవంబరు 6, 2023
HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## సీఎం కేసీఆర్ హెలిక్యాప్టర్‌లో సాంకేతిక లోపం..

హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రయాణిస్తున్న హెలిక్యాప్టర్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. అప్రమత్తంగా వ్యవహరించిన పైలెట్ వెంటనే లోపాన్ని గుర్తించి హెలిక్యాప్టర్‌ను సేఫ్ ల్యాండింగ్ చేశాడు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారం కోసం సీఎం కేసీఆర్ సోమవారం ఉదయం ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రం నుంచి హెలిక్యాప్టర్‌లో దేవరకద్రకు బయలుదేరిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పైలెట్ ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలోనే క్షేమంగా హెలిక్యాప్టర్‌ను దించేశాడు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం కేసీఆర్ ఇవాళ ఉమ్మడి పాలమూరు జిల్లాలోని దేవరకద్ర, నారాయణపేట, మక్తల్, గద్వాల్ నియోజకవర్గాల్లో జరిగే ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొనాల్సి ఉంది. అయితే హెలిక్యాప్టర్‌లో సాంకేతిక లోపం కారణంగా ఆయన పర్యటన ఆలస్యమైంది.





## బీఆర్ఎస్ పోరాటం కాంగ్రెస్ పార్టీతోనే: మంత్రి కేటీఆర్

వేములవాడ (వాయిస్ టుడే): ఈ ఎన్నికలు మీ తలరాతను మార్చేవి అని యువకులను ఉద్దేశించి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ అన్నారు. ఆరు దశాబ్దాల కాలంలో వందల మంది ప్రాణాలను తీసిన కాంగ్రెస్.. ఇవాళొచ్చి తియ్యటి మాటలు మాట్లాడితే మనం ఆగమైదామా..? ఆలోచించి ఓటేయండి అని కేటీఆర్ సూచించారు. తెలంగాణను చావగొట్టి, తాగు, సాగునీరు, కరెంట్ ఇవ్వకుండా రైతులను వేధించిన కాంగ్రెస్ పార్టీతోనే మనం పోరాటం అని తేల్చిచెప్పారు. పోటీ ఎప్పుడు రెండు ఆలోచన విధానాలు, సిద్ధాంతాలు, సంస్థల మధ్య జరుగుతది అని కేటీఆర్ పేర్కొన్నారు. వేములవాడ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.

తెలంగాణ ఉద్యమంలో వేములవాడ, సిరిసిల్ల.. ఇలా మానేరు వాగు వెంట ఉన్న ప్రతి ఊరు ఉగ్రుతలూగించిందని కేటీఆర్ గుర్తు చేశారు. మీరంతా కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారు. మీరందరూ 2014లో ఉద్యమంలో పాల్గొన్నారు. తెలంగాణ కోసం కేసీఆర్ చాలా కష్టపడ్డారు అని కేటీఆర్ గుర్తు చేశారు. దొరల తెలంగాణ కావాల్నా..? ప్రజల తెలంగాణ కావాల్నా..? అని రాహుల్ గాంధీ అంటున్నారు. మీ సవాల్‌ను తెలంగాణ సమాజం స్వీకరిస్తున్నారు. ఢిల్లీ దొరలకు, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల మధ్య జరిగే ఎన్నిక ఇది. ఢిల్లీ దొరల సంగతి తెలంగాణ చూసింది. మీ మెడలు వంచింది. బీజేపీకి, కాంగ్రెస్‌కు తెలంగాణ సమాజం తప్పకుండా బుద్ధి చెప్తది. ఢిల్లీకి, తెలంగాణకు మొదట్నుంచి పడదు. 1948 సెప్టెంబర్ 17న తెలంగాణకు స్వాతంత్ర్యం వచ్చింది. హైదరాబాద్ స్టేట్ పేరిట 1956లో ఒక ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాదణ ఉండే. వృద్ధిలో ఉండే. నాటి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు గోదావరి, కృష్ణా ప్రాజెక్టులకు రూపకల్పన చేసి అన్ని ఆలోచనలు చేసుకున్నారని కేటీఆర్ గుర్తు చేశారు.

## ఇప్పటి వరకూ 500 కోట్లకు పైనే పట్టుబడిన సొత్తు



హైదరాబాద్ (వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల్లో కోడ్ అమలుతో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకూ పట్టుబడిన సొత్తు రూ.500 కోట్లు దాటింది. నిన్న ఒక్క రోజే నిజాంపేట్‌లో 17 కేజీల బంగారం, 75 కేజీల వెండిని పోలీసులు పట్టుకున్నారు. తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులు నిర్వహిస్తున్నారు. ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులు, ఇన్నర్ డిస్ట్రిక్ట్ చెక్ పోస్టులను పోలీసులు ఏర్పాటు చేయడం జరిగింది. డబ్బు, బంగారం వెండి ఆభరణాలు, మద్యం బాటిళ్లు, ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే వస్తువులన్నీ పోలీసుల తనిఖీల్లో పట్టుబడుతున్నాయి.




## కామారెడ్డిలో కాంగ్రెస్ స్కెచ్

నిజామాబాద్, నవంబర్ 6, (వాయిస్ టుడే): తెలంగాణ ఎన్నికల రాజకీయం రంజుగా మారుతోంది. బీఆర్ఎస్ వర్సస్ కాంగ్రెస్ పోటీ ఇప్పుడు కొత్త టర్న్ తీసుకుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ సారి రెండు స్థానాల్లో పోటీ చేస్తున్నారు. ఇదే సమయంలో గజ్వేల్ నుంచి ఈటల..కామారెడ్డి నుంచి రేవంత్ రెండో స్థానంగా కేసీఆర్ పైన పోటీకి దిగుతున్నారు. కేసీఆర్ పై పోటీకి రేవంత్ కు పార్టీ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నిర్ణయం వెనుక భారీ స్కెచ్ ఉంది. గురి కుదిరితే సంచలనం నమోదవుతుందని పార్టీ అంచనా వేస్తోంది.

### కేసీఆర్ వర్సస్ రేవంత్..

తెలంగాణ ఎన్నికల్లో సీఎం కేసీఆర్ రెండు స్థానాల నుంచి పోటీ చేస్తున్నారు. తన సొంత నియోజకవర్గం గజ్వేల్‌తో పాటుగా కామారెడ్డి నుంచి బరిలోకి దిగుతున్నారు. కేసీఆర్ పైన పోటీకి బీజేపీ నుంచి గజ్వేల్ బరిలో మాజీ మంత్రి ఈటల దిగుతున్నారు. దీంతో పాటుగా తన నియోజకవర్గం హుజూరాబాద్ నుంచి పోటీ చేస్తున్నారు. అయితే, అనూహ్యంగా టీపీసీసీ చీఫ్ రేవంత్ ను ముఖ్యమంత్రి పైన పోటీకి దింపాలని కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయించింది. అక్కడ సీటు ఆశిస్తున్న షబ్బీర్ అలీకి నిజామాబాద్ అర్బన్ ఖరారు చేసింది. ఈ నెల 10న కర్ణాటక సీఎం సిద్దరామయ్య కామారెడ్డిలో పార్టీ బహిరంగ సభలో పాల్గొంటారు. బీసీ డిక్లరేషన్ ప్రకటిస్తారు. అదే రోజున రేవంత్ కామారెడ్డిలో నామినేషన్ దాఖలు చేయనున్నారు.

### కాంగ్రెస్ కొత్త లెక్కలు..

కామారెడ్డిలో సిట్టింగ్ ఎమ్మెల్యే కాదని కేసీఆర్ బరిలో నిలిచారు. రెండు నియోజకవర్గాల్లో గెలిస్తే ఏ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా కేసీఆర్ కొనసాగుతారనే దాని పైన భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. గజ్వేల్ తో తన అనుబంధం కొనసాగుతుందని కేసీఆర్ స్పష్టత ఇచ్చారు. ఇదే సమయంలో కేసీఆర్ పైన రేవంత్ ను పోటీకి దింపాలనే కాంగ్రెస్ నిర్ణయం వెనుక భారీ వ్యూహమే కనిపిస్తోంది. కేసీఆర్ ను ఢీ కొట్టటం ద్వారా రేవంత్ ఇమేజ్ పెరగటం ఖాయంగా కనిపిస్తోంది. నియోజకవర్గంలో ఉన్న సామాజిక సమీకరణాల్లో భాగంగా అక్కడే బీసీ డిక్లరేషన్ విడుదలకు కాంగ్రెస్ నిర్ణయించింది. కామారెడ్డి నుంచి గతంలో గెలిచిన షబ్బీర్ అలీ వంటి ప్రముఖ మైనార్టీ నేతను ఓడించేందుకు కేసీఆర్ ఇక్కడ పోటీ చేస్తున్నారని..అక్కడ మైనార్టీ నేత ఓడిపోకుండా మరో నియోజకవర్గానికి మార్చి..అక్కడ రేవంత్ పోటీకి దిగటం ద్వారా అక్కడి పరిస్థితులను సానుకూలంగా మలచుకోవాలనేది కాంగ్రెస్ వ్యూహంగా కనిపిస్తోంది. కామారెడ్డి నుంచి తొలుత బీజేపీ అభ్యర్ధిగా ఎంపీ అర్వింద్ పేరు ప్రచారంలోకి వచ్చింది. ఆ తరువాత అభ్యర్దుల ప్రకటనలో మారింది.దీంతో, కాంగ్రెస్ వ్యూహం మార్చింది. బీసీ ఓట్ బ్యాంక్ పైన అక్కడ గురి పెట్టింది. గురి కుదిరితే పూర్తి అనుకూలంగా మారుతుందని లెక్కలు వేస్తోంది. ఇదే సమయంలో షబ్బీర్ అలీని నిజామాబాద్ అర్బన్ నుంచి పోటీకి ఒప్పించింది. అక్కడ పెద్ద సంఖ్యలో మైనార్టీ ఓట్లు ఉన్నాయి. దీంతో, అక్కడ షబ్బీర్ అలీకి గెలుపు సునాయాసంగా భావిస్తున్నారు. ఇటు రేవంత్ కొడంగల్ తో పాటుగా కామారెడ్డిలో పోటీ చేయటం ద్వారా పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికల్లో తానే నేరుగా కేసీఆర్ ను ఢీ కొడితే కేడర్ లో జోష్ పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. దీంతో పాటుగా కేసీఆర్ కు గెలుపు కష్టతరం చేయాలనేది వ్యూహం. దీని ద్వారా మొత్తంగా ఆ ప్రాంతం పైన ప్రభావం ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ సమీకరణాలతో కామారెడ్డిలో కేసీఆర్ వర్సస్ రేవంత్ పోటీ ఆసక్తి కరంగా మారుతోంది.





## ప్రధాని మోడీ, అమిత్ షాతో పాటు తెలంగాణా బీజేపీ స్టార్ క్యాంపెయినర్లు వీళ్ళే!!



తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు అన్ని ప్రధాన పార్టీలు ప్రచార పర్వాన్ని కొనసాగిస్తున్నాయి. ఇక ప్రచార పర్వంలో దూకుడును పెంచడానికి బిజెపి కూడా రంగంలోకి దిగుతుంది. బిజెపి తరపున స్టార్ క్యాంపెయినర్ లను రంగంలోకి దించి జోరుగా ఎన్నికల ప్రచారాన్ని సాగించనుంది. ఇప్పటికే తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలతో రాష్ట్రవ్యాప్తంగా సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. మరోవైపు రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి తదితరులు కాంగ్రెస్ అభ్యర్థుల కోసం రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ ప్రచార వేడిని పెంచారు. ఇప్పుడు తాజాగా బీజేపీ కూడా కీలక నాయకులను రంగంలోకి దింపి ప్రచారాన్ని కొనసాగించనున్నారు. మొత్తం 40 మంది స్టార్ క్యాంపెయినర్లు బిజెపి తరపున ఎన్నికల ప్రచారాన్ని చేయనున్నారు. ప్రధాని మోడీ, అమిత్ షాతో పాటు తెలంగాణా బీజేపీ స్టార్ క్యాంపెయినర్లు వీళ్ళే!! ప్రధాని నరేంద్ర మోడీతో పాటు, హెూంమంత్రి అమిత్ షా, జేపీ నడ్డా, రాజ్ నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, యడియూరప్ప, కేంద్ర మహిళా మంత్రులు నిర్మలా సీతారామన్, స్మృతి ఇరానీ, పీయూష్ గోయల్, అర్జున్ ముండా, భూపేంద్ర యాదవ్, సాధ్వి నిరంజన్, జ్యోతి మురుగన్, ప్రకాష్ జవదేకర్, పురుషోత్తం రుపాల, తరుణ్ చుగ్, సునీల్ బన్సల్, అరవింద్ మీనన్ సహా పలువురు జాతీయనేతలు ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. ఇక రాష్ట్ర నాయకులకు స్టార్ క్యాంపెయినర్లుగా ఎవరికి స్థానం దక్కింది అంటే కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఈటల రాజేందర్, రాజసింగ్, లక్ష్మణ్, డీకే అరుణ, ఎంపీ అర్వింద్, రవి కిషన్, జితేందర్ రెడ్డి, కొండా విశ్వేశ్వరెడ్డి, నరసయ్య గౌడ్, ప్రదీప్ కుమార్, ప్రేమేందర్ రెడ్డిలు ఉన్నారు. అనేతకాదు బంగారు శృతి, కాసం వెంకటేశ్వర్లు, యాదవ్ కృష్ణ ప్రసాద్, పొంగులేటి సుధాకర్ రెడ్డి, పురందేశ్వరి, మురళీధర్ రావు, గరికపాటి మోహన్ రావు, జితేంద్ర రెడ్డి లకు స్థానం దక్కింది. బీజేపీ ప్రచార లిస్ట్‌లో విజయశాంతికి స్థానం దక్కకపోవడం గమనార్హం. ఇక ప్రజా క్షేత్రంలో బీజేపీ నుండి స్టార్ క్యాంపెయినర్లు రంగంలోకి దిగుతున్నారు.



## తెలంగాణ ప్రజలారా... మీ కోపాన్ని నవంబర్ 30న చూపెట్టండి

హైదరాబాద్(వాయిస్ టుడే): సూసైడ్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా తెలంగాణ మారిందని ఏఐసీసీ మీడియా కమిటీ చైర్మన్ పవన్ ఖేరా వ్యాఖ్యలు చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణ ప్రజలు ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. 9 ఎండ్లు తమని మోసం చేసిన కేసీఆర్‌కుబుద్ధి చెప్పాలని ప్రజలు నిర్ణయం తీసుకున్నారని అన్నారు. తెలంగాణలో నిరుద్యోగం పెరిగిందని.. పరీక్షలు కూడా సరిగా నిర్వహించలేకపోయారని విమర్శించారు. తెలంగాణ యువకుల జీవితాలతో కేసీఆర్ ప్రభుత్వం ఆటలాడుతోందన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఇచ్చిన అన్ని హామీలను కేసీఆర్ విస్మరించారన్నారు. ప్రభుత్వ వైఫల్యాల వల్ల విద్యార్థులు సూసైడ్ చేసుకుంటే ఆమె క్యారెక్టర్‌పై బురద జల్లే ప్రయత్నం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వంపై కోపంగా లేని ఒక్కరినైనా చూపెట్టగలరా అని ప్రశ్నించారు. “తెలంగాణ ప్రజల సమస్యలన్నింటికి పరిష్కారం నవంబర్ 30న ఇచ్చే తీర్పే.. మీ కోపాన్ని నవంబర్ 30న చూపెట్టండి” అంటూ పవన్ ఖేరా పేర్కొన్నారు.



## విజయవాడలో ప్లాట్‌ఫాంపైకి దూసుకొచ్చిన ఆర్టీసీ బస్సు

**ప్రమాద ఘటనలో ముగ్గురు మృతి**

**బస్సు చక్రాల కింద పడి కండక్టర్, మహిళ మృతి**

**మృతి చెందిన వారిలో 10 నెలల చిన్నారి**

విజయవాడ (వాయిస్ టుడే): తెల్లవారుజామున బస్సు కోసం ఎదురు చూస్తున్న వారిని మృత్యువు కబళించింది. విజయవాడలో ఆర్టీసీ బస్సు బీభత్సం సృష్టించి పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో ఫ్లాట్‌ఫామ్‌పైకి ఆర్టీసీ బస్సు దూసుకెళ్లిన ఈ ప్రమాద ఘటనలో ముగ్గురు మృతి చెందారు. 12వ నంబర్ ఫ్లాట్‌ఫైమ్ వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. కండెక్టర్‌తో పాటు మరో ఇద్దరు మృతి చెందారు. మృతి చెందిన వారిలో 10 నెలల చిన్నారి కూడా ఉంది. బ్రేక్ ఫెయిల్ కావడంతోనే ఇలా జరిగిందని ఆర్టీసీ అధికారులు స్పష్టం చేశారు. బస్సు విజయవాడ నుంచి గుంటూరుకు వెళ్లాల్సి ఉన్న సమయంలోనే ఈ ప్రమాదం చోటు చేసుకుంది. నగరంలోని పండిట్ నెహ్రూ బస్టాండ్ వద్ద ప్రమాదం జరిగింది. ప్లాట్‌ఫాంపై నిరీక్షిస్తున్న ప్రయాణికులపైకి ఆర్టీసీ బస్సు దూసుకొచ్చింది. విజయవాడ నగరంలోని పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సు బీభత్సం సృష్టించింది. 12వ ప్లాట్‌ఫాంపై నిరీక్షిస్తున్న ప్రయాణికులపైకి బస్సు వేగంగా దూసుకెళ్లింది. ఈ ఘటనలో బస్సు చక్రాల కింద పడి కండక్టర్, మహిళ,10 నెలల చిన్నారి మృతి చెందారు. బస్సు డ్రైవర్



రివర్స్ గేర్‌కు బదులు ఫస్ట్ గేర్ వేయడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంతో 11, 12 ప్లాట్‌ఫాంల వద్ద దిమ్మెలు విరిగి ఫెన్సింగ్, కుర్చీలు ధ్వంసమయ్యాయి. విజయవాడలోని ఆటోనగర్ డిపోకు చెందిన బస్సు గుంటూరు వెళ్లాల్సి ఉండగా ఈ ఘటన జరిగింది. మృతిచెందిన కండక్టర్‌ను గుంటూరు-2 డిపోకు చెందిన వీరయ్యగా గుర్తించారు. ఘటనాస్థలాన్ని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడారు. బస్సు ప్రమాదం దురదృష్టకరమన్నారు. ఈ ఘటనపై 24 గంటల్లో పూర్తిస్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. మృతుల కుటుంబాలకు రూ.5లక్షల పరిహారం అందజేస్తామన్నారు.

## ఇంకా ఆగని మేడిగడ్డ వివాదం



హైదరాబాద్, నవంబర్ 6, (వాయిస్ టుడే): మేడిగడ్డ అనకట్టపై జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చిన నివేదికపై తెలంగాణ నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ కుమార్‌కీలక వ్యాఖ్యలు చేశారు. నివేదికలో అనకట్టకు సంబంధం లేని అంశాలున్నాయన్న ఆయన, వాస్తవాలను పూర్తిగా పరిగణనలోకి తీసుకోలేదన్నారు. రాష్ట్ర అథారిటీ ఇచ్చిన వివరాలను పూర్తిగా పరిశీలించలేదన్నారు రజత్ కుమార్. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చిన నివేదికలో తొందర పాటు అంశాలున్నాయని వెల్లడించారు. విచారణ పూర్తికాకుండా కుంగుబాటుకు సరైన కారణాలు నిర్ధారించలేమని, ప్రస్తుత స్థితిలో కేంద్ర అథారిటీతో అంగీకరించలేమని స్పష్టం చేశారు. క్వాలిటీ కంట్రోల్ సరిగా లేదన్న అభిప్రాయంతో ఏకీభవించలేమన్నారు రజత్ కుమార్నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ కుమార్ సమీక్ష నిర్వహించారు. ఈఎన్సీలు, ఇంజినీర్లతో సమావేశమైన ఆయన నివేదికలోని అంశాలపై చర్చించారు. మేడిగడ్డపై జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ లేవనెత్తిన అంశాలు, ఆరోపణలపై తగిన వివరాలతో తెలంగాణ ప్రభుత్వం సమాధానం ఇచ్చింది. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఛైర్మన్‌కు రజత్ కుమార్ లేఖ రాశారు. పూర్తి మరమ్మతుల తర్వాతే బ్యారేజీ ఆపరేషన్స్ కొనసాగుతాయన్న ఆయన, మరమ్మతు చర్యలు ఇప్పటికే ప్రారంభమైనట్లు లేఖలో ప్రస్తావించారు.



## జనసేన తెలంగాణ విభాగంలో ప్రముఖుల చేరిక

### పార్టీలో చేరిన ప్రముఖ టీవీ, సినీ నటుడు సాగర్

హైదరాబాద్ (వాయిస్ టుడే): జనసేన పార్టీ సిద్ధాంతాలు, పవన్ కళ్యాణ్ నాయకత్వంపై విశ్వాసంతో తెలంగాణకు చెందిన పలు వర్గాలు పార్టీలో చేరాయి. సోమవారం మధ్యాహ్నం హైదరాబాద్ లో పార్టీ తెలంగాణ కార్యాలయంలో పవన్ కళ్యాణ్ సమక్షంలో చేరికలు సాగాయి. హైదరాబాద్ నగరానికి చెందిన స్థిరాస్థి వ్యాపారి, గ్రేటర్ హైదరాబాద్ వెస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ జనసేనలో చేరారు. ఈయనకు పవన్ కళ్యాణ్ పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన వ్యాపారవేత్త, రాజకీయ నాయకుడు లక్కినేని సురేందర్ రావు తన అనుచరులతో కలసి పార్టీలో చేరారు. ఈయనకు పవన్ కళ్యాణ్ పార్టీ కండువా వేశారు. అదే జిల్లాకు చెందిన ముయ్యబోయిన ఉమాదేవి, ఆమె భర్త నాగబాబు జనసేనలో చేరారు. కోవిడ్ సమయంలో ఈ కుటుంబం పలు సేవా కార్యక్రమాలు చేపట్టింది.

పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ముందుకు వెళ్తాం : పలు ధారావాహికల్లో నటించి కుటుంబ ప్రేకక్షకులకు చేరువైన నటుడు సాగర్ జనసేన పార్టీలో చేరారు. పవన్ కళ్యాణ్ సాగర్ కి పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ జనసేన పార్టీ ప్రజల కోసం నిలబడుతోంది. పవన్ కళ్యాణ్ నాయకత్వం, ఆయన ప్రజా పోరాటాలు నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. పార్టీలో ఏ బాధ్యత అప్పగించినా చిత్తశుద్ధితో నెరవేరుస్తానన్నారు. ప్రేమ కుమార్, సురేందర్ రావు, ఉమాదేవి మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ముందుకు వెళ్తాం. తెలంగాణలో పార్టీ చేపట్టే కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు బి.మహేందర్ రెడ్డి, తెలంగాణ ఇంచార్జ్ నేమూరి శంకర్ గౌడ్, పార్టీ నేతలు రామ్ తాళ్ళూరి, శ్ర రాధారం రాజలింగం పాల్గొన్నారు.

## కుక్క తోక తగిలితే కూలి పోయేలా కాళేశ్వరం దుస్థితి



హైదరాబాద్ (వాయిస్ టుడే): రూ.38 వేల కోట్లతో 16 లక్షల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాలని కాళేశ్వరం చేపట్టారని వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల పేర్కొన్నారు. నేడు ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ప్రాజెక్టు పరిస్థితి కుక్క తోక తగిలితే కూలి పోయేలా కాళేశ్వరం దుస్థితి ఏర్పడిందన్నారు. అన్నారం పంపు హౌస్ , మేడిగడ్డ పరిస్థితిపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ వాళ్ళు నిగ్గు తేల్చారన్నారు. 20 అంశాలపై వివరణ అడిగితే 11అంశాలపై క్లారిటీ ఇచ్చారని షర్మిల పేర్కొన్నారు. బ్యారేజ్ నిర్మాణమే వేస్ట్ అని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ రిపోర్ట్ ఇచ్చిందని షర్మిల వెల్లడించారు. మేడిగడ్డ కు వచ్చిన ఇబ్బంది రాబోయే రోజుల్లో అన్నారం , సుందిళ్లకు ప్రమాదం రానుందని హెచ్చరించిందని తెలిపారు. కేవలం కమిషన్ల కోసమే ప్రాజెక్టుల వ్యయాన్ని భారీగా పెంచారని షర్మిల వెల్లడించారు. సేమ్ ప్రాజెక్టును రాజ శేఖర్ రెడ్డి రూ.38 వేల కోట్ల తో నిర్మాణం చేయాలని భావిస్తే దానిని కేసీఆర్ లక్ష కోట్లకు పెంచి18లక్షల ఎకరాలకు నీరు ఇస్తామన్నారని తెలిపారు. కేసీఆర్ వైఎస్ కంటే కేవలం రెండున్నర ఎకరాలకు మాత్రమే పెంచారన్నారు. అసెంబ్లీ వేదికగా సాగునీటిపై అనేక అబద్ధాలు ఆడారని షర్మిల వెల్లడించారు.

## పాలమూరును సర్వనాశనం చేసిందే కాంగ్రెస్ పార్టీ: సీఎం కేసీఆర్



దేవరకద్ర (వాయిస్ టుడే): కృష్ణా, తుంగభద్ర నదులు ఒరుసుకుంటూ పారే ఈ పాలమూరు జిల్లాను సర్వనాశనం చేసిందే కాంగ్రెస్ పార్టీ అని ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్వజమెత్తారు. దేవరకద్ర నియోజక వర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. పాలమూరు జిల్లా ఒకప్పుడు పాలుగారిన జిల్లా. అద్భుతమైన జిల్లాను సమైక్య రాష్ట్రంలో ఘోరమైన గతి పట్టించారు. ఆనాడు ఉన్న సీఎంలు కూడా జిల్లాను దత్తత తీసుకున్నామని చెప్పి పునాది రాళ్లు వేశారు తప్ప.. కనికెడు నీళ్లు తెచ్చివ్వలేదు. పంటలు ఎండిపోయి వలవల ఏడ్సి, బొంబాయి బతకపోయి చాలా వలసలు పోయి, చాలా బాధలు అనుభవించిన జిల్లా పాలమూరు. అలాంటి పాలమూరు జిల్లాను ఏ పార్టీ పట్టించుకున్నది..? మన గోస ఎవడైనా చూసిండా..? అన్నది ఆలోచించాలని కేసీఆర్ సూచించారు. కృష్ణా, తుంగభద్ర నదులు ఒరుసుకుంటూ పారే జిల్లాలో గంజి కేంద్రాలు పెట్టించే గతి పట్టించింది ఏ పార్టీనో ఆలోచించాలి. మహబూబ్‌నగర్ జిల్లా 50 ఏండ్ల పాటు చాలా కరువు అనుభవించింది. దానికి కారణం కాంగ్రెస్ పార్టీ. ఉన్న తెలంగాణను ఊడగొట్టి ఆంధ్రప్రదేశ్‌లో కలిసి మన ప్రాజెక్టులను సమైక్య పాలకులు రద్దు చేశారు. ఒకటే ఒక్క ప్రాజెక్టు అడగలేదు నాటి కాంగ్రెస్ నాయకులు. బచవాత్ ట్రిబ్యునల్ 1974లో నది నీళ్ల పంపకం చేస్తే ఏ మంత్రి, ఎమ్మెల్యే అడగలేదు. పాలమూరుకు నీళ్లు ఎన్ని కేటాయిస్తున్నారని ప్రశ్నించలేదు. ఇది రికార్డులో ఉంది.. రాజకీయం కోసం చెప్పట్లేదు. ఈ ప్రాంతం ఏపీలో కలకవపోతే చాలా బాగుపడుతుంటే.. నష్టపోయింది.. చారెడు నీళ్లు కావాలని అడిగేతోడు లేడు. మాకు వికారం అనిపిస్తుంది అని చెప్పి బచావత్ ట్రిబ్యునలే.. 17 టీఎంసీల సామర్థ్యం గల జూరాల ప్రాజెక్టు మంజూరు చేశారు. దాన్ని కట్టలేదు. మన తెలంగాణ బిడ్డ అంజయ్య ముఖ్యమంత్రి అయ్యాకు శంకుస్థాపన చేస్తే ఆ ప్రాజెక్టు ముందరపడ్డది. అయినా నీళ్లు రాలేదు. కర్ణాటకకు చెల్లించాల్సిన డబ్బు చెల్లించకుండా దుర్మార్గం చేసి, 2001లో గులాబీ జెండా ఎగిరేదాకా కర్ణాటకు నష్టపరిహారం చెల్లించలేదు.. ఇక్కడ రైతాంగానికి నీళ్లు ఇవ్వలేదు. ఇది చరిత్ర నేను చెప్పేది సత్యం అని కేసీఆర్ పేర్కొన్నారు. ఇంత అన్యాయం చేసిన పార్టీ కాంగ్రెస్. పాలమూరును సర్వనాశనం చేసిన పార్టీ కాంగ్రెస్సే. మీ పెద్దలను అడిగినా ఇదే విషయం చెబుతారు. నేను చెప్పింది నిజమైతే ఆల వెంకటేశ్వర్ రెడ్డిని 50 వేల మెజార్టీతో గెలిపించాలి. నిజం కాకపోతే మమ్మల్ని ఓడించండి. 2004లో పొత్తు పెట్టుకుని మళ్లీ మోసం చేసింది. వైఎస్ మాటలు విని మన పార్టీని మోసం చేసింది కాంగ్రెస్. ఎమ్మెల్యేలను కొనే ప్రయత్నం చేశారు.వందల మంది పిల్లల ప్రాణాలను బలిగొన్న తర్వాత, ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడితే తప్పనిసరిస్థితుల్లో గతిలేక తెలంగాణను ఇచ్చింది కాంగ్రెస్ అని కేసీఆర్ తెలిపారు.



## గంగుల ల్యాండ్ కబ్జాలు చేస్తున్నారు

కరీంనగర్ (వాయిస్ టుడే): బీజేపీ ఎంపీ బండి సంజయ్ పోరాటం చూసి ఎమ్ఐఎమ్ ఆఫీస్‌కు మంత్రి గంగుల కమలాకర్ పరుగెత్తారని ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. నేడు రాజాసింగ్ మీడియాతో మాట్లాడుతూ.. గంగుల ల్యాండ్ కబ్జాలు చేస్తున్నారని విమర్శించారు. తనతో పాటు బండి సంజయ్‌ను అసెంబ్లీకి తీసుకెళ్తానని పేర్కొన్నారు. 'ఓవైసి నీకు దమ్ముందా..? ఉంటే కరీంనగర్‌లో పోటీకి పెట్టు' అని రాజాసింగ్ సవాల్ విసిరారు. కరీంనగర్ మైనార్టీలు ఆలోచన చేయాలన్నారు. మైనార్టీ అక్కా చెల్లెళ్ళ పరువు త్రిపుల్ తలాక్‌తో కాపాడామని రాజాసింగ్ వెల్లడించారు.

## స్పీడందుకున్న నామినేషన్ల పర్వంబీ ఎర్రబెల్లి, బండి సంజయ్, రేవంత్ రెడ్డి నామినేషన్ల దాఖలు!!



హైదరాబాద్ (వాయిస్ టుడే): తెలంగాణ శాసనసభ నామినేషన్ల పర్వం కొనసాగుతుంది. ఈరోజు మంచి రోజు కావడంతో ఎన్నికల బరిలోకి దిగిన పలువురు ముఖ్యమైన అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో తెలంగాణ శాసనసభ ఎన్నికల నామినేషన్ల వేగం పుంజుకుంది. ఈరోజు మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు, పిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, బిజెపి మాజీ అధ్యక్షుడు బండి సంజయ్ తో, సహా పలువురు ప్రముఖులు తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.జనగాం జిల్లా పాలకుర్తి నియోజకవర్గం నుంచి రాష్ట్ర మంత్రి, బిఆర్ఎస్ అభ్యర్థి ఎర్రబెల్లి దయాకరరావు ఈరోజు తమ మొదటి సెట్ నామినేషన్ ను దాఖలు చేశారు. తమ అనుచరులతో కలిసి తహసిల్దార్ కార్యాలయానికి చేరుకున్న మంత్రి రిటర్నింగ్ అధికారి జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ కు తొలి సెట్ నామినేషన్ పత్రాలను సమర్పించారు.

అంతకముందు మంత్రి ఎర్రబెల్లి ప్రతి శాసనసభ ఎన్నికల్లో నామినేషన్ వేసే ముందు తమ ఆనవాయితీ ప్రకారం భార్య ఉషా దయాకర్ రావు తో కలిసి హనుమకొండలో గల హనుమాన్, సాయిబాబా ఆలయాలు, ఐనవోలు మల్లిఖార్జున స్వామి ఆలయం, తమ ఇంటి ఇలవేల్పు యాదగిరి గుట్ట లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం, తొర్రూరు దర్గా, పాలకుర్తి శ్రీ సోమేశ్వర లక్ష్మీ నరసింహస్వామి వారి పాదాల వద్ద నామినేషన్ పత్రాలు పెట్టి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

బిజెపి జాతీయ అధ్యక్షులు, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, బండి సంజయ్ నామినేషన్ నేడు దాఖలు చేశారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం స్థానానికి నామినేషన్ పత్రాలు సమర్పించడానికి కరీంనగర్ రిటర్నింగ్ కార్యాలయానికి చేరుకున్న బండి సంజయ్ కేవలం 5గురు మాత్రమే లోపలికి వెళ్లాలానే నిబంధనతో స్వయంగా వాహనాన్ని నడుపుకుంటూ రిటర్నింగ్ కార్యాలయం వద్దకు వెళ్లారు. కరీంనగర్ రిటర్నింగ్ అధికారి కె మహేశ్వర్ కు బండి తన నామినేషన్ పత్రాలను సమర్పించారు.

అంతకు ముందు కరీంనగర్ జిల్లా కేంద్రం ఎన్టీఆర్ చౌరస్తా నుండి వేలాది మంది యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ సందర్భంగా బండి సంజయ్ తో కలిసి రాజాసింగ్ మాట్లాడుతూ బండి సంజయ్ వ్యక్తి కాదని, ఓ శక్తి అని అభివర్ణించారు. కరీంనగర్ లో పెద్దన్న బండి సంజయ్ నామినేషన్ కార్యక్రమానికి రావడం ఆనందంగా ఉందన్నారు.

మీరు ఇక్కడి నుండే సంజయన్నను ఎంపీ చేసి పార్లమెంట్ కు పంపారు. ఇప్పుడు అసెంబ్లీకి పంపుతారని భావిస్తున్నట్లు రాజా సింగ్ తెలిపారు.మరోవైపు హెలికాప్టర్లో వెళ్లి టిపిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కొడంగల్ లో నామినేషన్ దాఖలు చేశారు .భారీగా కార్యకర్తల నడుమ ర్యాలీగా వెళ్లిన రేవంత్ రెడ్డి నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. అంతకుముందు కార్యకర్తలను ఉద్దేశించి రేవంత్ రెడ్డి ఉద్వేగంగా మాట్లాడారు.

## మల్కాజ్‌గిరి నియోజకవర్గం కాస్ట్లీయస్ట్ ...




హైదరాబాద్, నవంబర్ 6, (వాయిస్ టుడే): హైదరాబాద్ నగరంలో అతి పెద్ద నియోజకవర్గం మల్కాజ్‌గిరి. ఇప్పుడు ఈ నియోజకవర్గం నుంచి ప్రత్యేకంగా మాట్లాడుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. రాష్ట్రంలోనే అతి ఖరీదైన ఎన్నికగా దీన్ని భావిస్తున్నారు. నియోజకవర్గం పరిధి ఎక్కువగా ఉండటం, ఓటర్ల సంఖ్య కూడా అధికంగా ఉండటం ఒక కారణమయితే... పోటీ చేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులిద్దరూ కోటీశ్వరులే. అందుకే ఇక్కడ రెండు పార్టీలకు చెందిన అభ్యర్థులు డబ్బులు వెదజల్లుతారు. ఇక్కడ ఓటుకు ఎంత పలుకుతుందో అంతలో సగమే మిగిలిన నియోజకవర్గాల్లో ఉంటుందని రాజకీయ పండితులు సయితం అంగీకరిస్తున్న విషయం. ఎవరూ తగ్గేదేలే అన్నట్లు వ్యవహరిస్తుండటంతో ప్రచారం నుంచి అన్ని రకాలుగా ఇక్కడ ఖరీదుగానే కనిపిస్తుంది. తెలంగాణలో అన్నింటికంటే ఫలితం చివర వచ్చేది కూడా ఈ నియోజకవర్గమే. ఎందుకంటే అన్ని ఈవీఎంలను లెక్కించాల్సి ఉంటుంది. ప్రచారం ముమ్మరం బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి... మల్కాజ్‌గిరి అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పోటీ చేస్తున్నారు. ఆయన మొన్నటి వరకూ బీఆర్ఎస్ పార్టీలో ఉన్నారు. తొలి విడతలోనే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆయన పేరును ప్రకటించారు. అయితే తన కుమారుడికి మెదక్ సీటు ఇవ్వలేదన్న ఏకైక కారణంతో ఆయన పార్టీని వదిలేసి వచ్చారు. కాంగ్రెస్ తో ముందుగానే ఒప్పందం కుదుర్చుకుని కాంగ్రెస్ కండువా కప్పేసుకున్నారు. అనుకున్నట్లే ఆయన కుటుంబానికి కాంగ్రెస్ రెండు స్థానాలు ఇచ్చింది. ఒకటి మల్కాజ్ గిరిలో తనకు, రెండోది మెదక్ లో తన కుమారుడు రోహిత్ కి సీటును ఖరారు చేసింది. అందరూ షర్మిలలా ఉంటారా...? ప్రతిష్టాత్మకంగా తీసుకుని... మైనంపల్లి హన్మంతరావు ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఎలాగైనా మరోసారి తాను గెలవాలని భావిస్తున్నారు. అందుకు అవసరమైన డబ్బును ఖర్చు చేసేందుకు సిద్ధపడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. మరోవైపు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి కూడా తక్కువేమీ కాదు. ఆయన మంత్రి మల్లారెడ్డి అల్లుడు. వందల కోట్ల సంపదకు అధిపతి. ఈ ఎన్నికలో గెలవాలని కేసీఆర్ మల్లారెడ్డికి టార్గెట్ గా పెట్టారు. దీంతో బీఆర్ఎస్ అభ్యర్థి కూడా అన్ని రకాలుగా డబ్బులు ఖర్చు చేసేందుకు ఏ మాత్రం వెనకాడటం లేదు. మంత్రి మల్లారెడ్డి కూడా మల్కాజ్ గిరిని ప్రెస్టేజియస్ గా తీసుకున్నారు. మైనంపల్లిని ఓడించగలిగితేనే మరోసారి తనకు కేసీఆర్ కేబినెట్‌లో బెర్త్ లభిస్తుందన్న సమాచారంతో ఆయన అల్లుడి కోసం ఎంత డబ్బును వెదజల్లడానికైనా రెడీ అంటున్నారు. ఒకసారి మల్కాజ్‌గిరి నియోజకవర్గానికి వెళితే రెండు పార్టీలకు చెందిన అభ్యర్థుల ఫ్లెక్సీలు, ప్రచారాన్ని చూస్తేనే వారు ఎంత సొమ్మును ఖర్చు చేస్తున్నారో ఇట్టే అర్థమవుతుంది. జనసేన ఆ సీట్లలో పోటీ చేయడం గ్యారంటీ అతి పెద్ద నియోజకవర్గంతో పాటు... మల్కాజ్‌గిరి నియోజకవర్గం పరిధిలో మల్కాజ్‌గిరి, సఫిల్‌గూడ, మౌలాలి, వినాయక్ నగర్, కాకతీయ నగర్, తూర్పు ఆనందబాగ్, గౌతమ్ నగర్, నేరేడ్‌మెట్, సైనిక్ పురి, ఆల్వాల్, యాప్రాల్, మచ్చ బొల్లారం వంటి ప్రాంతాలున్నాయి. ఈ ప్రాంతల్లో పేదలు అధికంగా నివసిస్తుంటారు. వీరి ఓట్లను కొనుగోలు చేయడానికి రెండు పార్టీల అభ్యర్థులు ఇప్పటికే ప్రయత్నాలు మొదలుపెట్టారన్న ప్రచారం జరుగుతుంది. ఇంటిలో ఐదు ఓట్లు ఉంటే చాలు పాతికవేలుతో పాటు వారు కోరిన ఫ్రిడ్జ్ లేదా కలర్ టీవీ వంటి వాటిని కూడా ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. అందులో నిజానిజాలు ఎంత ఉన్నప్పటికీ తెలంగాణలోనే అతి ఖరీదైన ఎన్నిక మల్కాజ్ గిరి అని చెప్పక తప్పదు. ఈ నియోజకవర్గంలో బీజేపీ నుంచి ప్రముఖ న్యాయవాది రామచంద్రరావు పోటీ చేస్తున్నారు.

## వయ్యారి భామ రాజకీయాలు మీరే గమనించాలి




ఖమ్మం (వాయిస్ టుడే): ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు నేడు 46... 47... 48 డివిజన్లలో రోడ్ షో నిర్వహించారు. కాంగ్రెస్ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. మున్నేరు వరదల విషయంలో ఎన్నికల ముందు శంకుస్థాపనలు నమ్ముతారా? అని ప్రశ్నించారు. వయ్యారి భామ రాజకీయాలు మీరే గమనించాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మున్నేరు వరదలకు అడ్డుకట్టగా కరకట్ట నిర్మాణం చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలు మహిళల వికాసం ప్రగతి కోసం సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ పెద్ద పీట వేశారని తుమ్మల అన్నారు.

## హెచ్‌సీఏలో భారీ అవినీతి.. అజారుద్దీన్‌పై నాలుగు కేసులు నమోదు



హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ నేత మహమ్మద్ అజారుద్దీన్ పై నాలుగు కేసులు నమోదయ్యాయి. హెచ్‌సీఏలో భారీ అవినీతి జరిగిందని ఆయన ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో రాచకొండ పోలీసులు అజారుద్దీన్‌పై నాలుగు కేసులు నమోదు చేశారు. మరోవైపు తనపై నమోదైన నాలుగు కేసుల్లో బెయిల్ కోసం మల్కాజ్‌గిరి కోర్టును ఆయన ఆశ్రయించారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఉప్పల్ స్టేడియంలో వివిధ సామగ్రి కొనుగోళ్లలో కోట్ల రూపాయల గోల్ మాల్ జరిగిందని అజారుద్దీన్‌పై ఆరోపణలు వచ్చాయి. హెచ్‌సీఏలో కోట్ల రూపాయల నిధులు గోల్‌మాల్ చేశారని.. టెండర్ల పేరుతో థర్డ్ పార్టీకి నిధులు కట్టబెట్టారని అజారుద్దీన్‌పై కేసు నమోదు అయింది. అగ్నిమాపక పరికరాలు, క్రికెట్ బంతులు, బకెట్ కుర్చీలు, జిమ్ సామాగ్రితో సహా అనేక పరికరాల కొనుగోలు వ్యవహారంలో అవకతవకలు జరిగినట్లు తేలడంతో రాచకొండ పోలీసులు ఆయనపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. మరోవైపు నవంబర్ 30న జరగనున్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి అజారుద్దీన్ సిద్ధమైన విషయం తెలిసిందే. జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి ఆయన పోటీ చేయాలని భావిస్తున్నారు.